



అన్నదమ్ముల ముచ్చట్లు.. యారాళ్ల చేతివంటలు.. ఆడపడుచుల కబుర్లు.. బావబామ్మర్దుల పలకరింపులు.. చిన్నారుల కేరింతలు. ఉమ్మడి కుటుంబంతో కళకళలాడుతున్న ఇండ్లు. ఈ ఆనంద క్షణాన్ని చూసి తల్లిదండ్రుల కళ్లలో కనిపించే ఆనందభాష్పాలు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటింటా ఆవిష్కృతమయ్యే దృశ్యాలు ఇవీ. ఉద్యోగం.. ఉపాధి.. పిల్లల ఉన్నతవిద్య, తదితర కారణాలతో ఉమ్మడి కుటుంబాలు విడిపోయి వేర్వేరు చోట్ల జీవనం సాగిస్తున్న తరుణం ఇది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారిలో పండుగలకు సొంత ఊరు చేరి కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్న వారు కొందరే. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలకు చెందినవారు వివిధ ప్రదేశాల్లో స్థిరపడినా.. సంక్రాంతికి సొంతింటికి వస్తామని చెబుతున్నారు. తల్లిదండ్రులతో ఆనందంగా పండుగ జరుపుకుంటామని అంటున్న వారిపై కథనం..!!

- ఎక్కడెక్కడి నుంచో ఒక్కచోట చేరి
- ఇంటిల్లిపాది ఆనందంగా గడుపుతూ...
- ఘనంగా వేడుక జరుపుకుంటున్న ప్రజలు

సంక్రాంతి సందడి

ఉమ్మడి కుటుంబం.. పండుగ వైభవం



చెప్పలేని ఆనందం


బోయినపల్లిలో శ్రీపతి శ్రీహరి కుటుంబం

బోయినపల్లి(చొప్పదండి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన శ్రీపతి లక్ష్మి–శ్రీహరి దంపతులకు నలుగురు కొడుకులు శ్రీనివాస్, చంద్రమౌళి, క్రిష్ణహరి, జనార్దన్ ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. అందరూ వారివారి రంగాల్లో రాణిస్తున్నారు. పెద్దకొడుకు శ్రీనివాస్–కవిత దంపతుల కూతుళ్లు విజేత, సాయిప్రియలకు సైతం వివాహాలు అయి పిల్లలు ఉన్నారు. పండుగల సందర్భంలో అందరూ ఇంటికి వస్తుంటారు. ఒకేచోట వేడుక జరుపుకుంటారు. 'నాకు నలుగురు కొడుకులు. మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. రెండు తరాల అనుబంధం మాది. పండక్కి కొడుకులు, కూతుళ్లు, అల్లుండ్లు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లతో సందడిగా ఉంటుంది' అంటూ.. శ్రీపతి శ్రీహరి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

సకుటుంబ సపరివారంగా


కుటుంబసభ్యులతో బలరాం సెల్ఫీ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్తనపేటకు చెందిన బుర్రవేణి కొండయ్య –లక్ష్మి దంపతులకు ముగ్గురు కొడుకులు. ఈ ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగులు. వేర్వేరుప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నా పండుగకు ఇంటికి వస్తుంటారు. పెద్దకొడుకు బలరాం సూర్యాపేటలో సబ్‌రిజిస్ట్రార్. రెండో కొడుకు మల్లికార్జున్ హైదరాబాద్‌లో పోలీస్‌కానిస్టేబుల్. చిన్న కొడుకు భాను జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారీపేట (ఎల్‌టీ)లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. పండుగ సందర్భంగా వీరంతా శనివారం సాయంత్రం మర్తనపేటలోని ఇంటికి చేరారు. కొండయ్య–లక్ష్మి దంపతులకు కొలనూర్, రామన్నపల్లె శివారుల్లో వ్యవసాయ భూమి ఉంది. వీరంతా పిల్లలతో పొలం వద్ద పండుగ జరుపుకుంటారు. కొండయ్య మనువలు అర్జున్, ఆదిత్య, మనవరాళ్లు ఆరాధ్య, అవంతికలతో మొక్కలు నాటించాడు. కోడళ్లు సంధ్య, రేఖ, చైతన్యలు సంక్రాంతికి పిండివంటలు చేస్తూ.. వేడుకల్లో భాగస్వాములు అయ్యారు. ఎక్కడ పని చేసినా.. పండుగకు సొంత ఊరుకు రావడం సంతోషంగా ఉంటుందని, అమ్మానాన్నలతో గడుపడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని బలరాం, మల్లికార్జున్, భాను చెబుతున్నారు.


సిరిసిల్లలో భోగిమంటలు

సింగాపూర్ టు హుజూరాబాద్


టీవీ చూస్తున్న కుటుంబ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్‌లో ఉన్నా స్వదేశంపై ఉన్న మమకారంతో పండుగకు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతాడు బైరి భిక్షపతి. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బైరి భిక్షపతి గతంలో బీఎస్ఎన్ఎల్‌లో పనిచేశాడు. సింగాపూర్‌లో సాఫ్ట్‌వేర్ కొలువు రావడంతో కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. హుజూరాబాద్ పట్టణంలో ఆయన సోదరి ఉంటోంది. ఏదో ఒక పండుగకు కుటుంబంతో సహా హుజూరాబాద్ వస్తారు. చెల్లి ఇంట్లో ఓ వారం పాటు ఉండి తిరిగి సింగాపూర్ వెళ్లిపోతారు. ఈ సంక్రాంతికి వారం ముందగానే వచ్చారు.

అందరూ కలిసే..


అర్జున్- భీమక్క కుటుంబం

జగిత్యాల: ఉమ్మడిగానే అన్ని పండుగలు జరుపుకుంటామని జగిత్యాలకు చెందిన కొండేరి అర్జున్– భీమక్కలు చెబుతున్నారు. పట్టణానికి చెందిన అర్జున్–భీమక్కలకు ఐదుగురు కొడుకులు, కూతురు ఉన్నారు. కొడుకులు ఉద్యోగాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్నా.. తండ్రి ఆదేశాలమేరకే నడుచుకుంటారు. పెద్దలు.. పిల్లలు అంతా కలిపి 25మంది వరకు ఉంటారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇంటికి చేరి ఆనందంగా గడుపుతున్నారు.

18 ఏళ్లలో తొలిసారిగా..


గోపాల్‌రావుపల్లెలో కడారి కుటుంబం

సిరిసిల్లకల్చరల్: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బొల్లం నారాయణరెడ్డి సుమారు 20 ఏళ్ల కిందటే అమెరికా వెళ్లి స్థిరపడ్డాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించి రాణిస్తున్నాడు. నిరంతరం బిజీగా ఉండే జీవితాన్ని గాడిలో పెట్టే క్రమంలో ఏళ్లు గడిచాయి. సంక్రాంతి రోజైనా అయిన వాళ్లందరినీ ఒకే చోట చేర్చాలనుకున్నాడు. శనివారం పెద్దమ్మ, పెదనాన్న కడారి జయ, రాజారాం రెడ్డి ఉండే గోపాల్‌రావుపల్లె చేరుకున్నాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన పెద్దమ్మ కొడుకులు ఇద్దరు పవన్, సుధ, ప్రవీణ్, బస్విలతో పాటు వాళ్ల పిల్లలు కలుసుకున్నారు. తన అర్థాంగి వందన, కూతురు అనన్యతో పాటు అందరూ భోగి పండుగను జరుపుకున్నారు. సంక్రాంతిని సొంతఊరు బస్వాపూర్‌లో ఇంతే సందడిగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. సుమారు 18 ఏళ్ల తరువాత రెండు కుటుంబాల్లోని సభ్యులందరూ ఒకే చోటుకు చేరారు.

ఎంత బిజీగా ఉన్నా..


మల్లయ్యతో కుటుంబసభ్యులు

పెద్దపల్లిరూరల్: ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటున్నా పండుగ సమయంలో ఒకచోట చేరి సంతోషంగా గడుపుతామంటున్నారు పెద్దపల్లికి చెందిన మల్లయ్య. మల్లయ్యకు నలుగురు కొడుకులు కనకయ్య, రాము, వెంకటాచలం, నారాయణ, కూతురు వెంకటలక్ష్మి సంతానం. ఉద్యోగ రిత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. పండుగకు కుటుంబ సభ్యులతో గడిపేందుకు వెంటకలక్ష్మి కూతురు స్రవంతి ఆమెభర్త హరికృష్ణ, పిల్లలు సాత్విక్, అలోక్యతో పాటు శ్రీనివాస్, సుజాత, శ్యాంకుమార్, రాధిక, వెంకటాచలం, నారాయణ కుటుంబంతో సహా పెద్దపల్లిలోని వారి ఇంటికి వచ్చారు.

పండుగ కోసమే..


కుటుంబసభ్యులంతా ఒక్కచోట చేరి పిండివంటలు చేస్తూ...

పెద్దపల్లిరూరల్: ఉద్యోగరిత్యా హైదరాబాద్, చెన్నైలో ఉంటున్న రమేశ్, కిరణ్ సంక్రాంతికి పెద్దపల్లిలో నివాసముండే తల్లిదండ్రులు బొమ్మిదేని సమ్మయ్య, రాజేశ్వరి వద్దకు వచ్చారు. బొమ్మిదేని సమ్మయ్య ఎన్టీపీసీలో ఉద్యోగం చేసి పదేళ్లక్రితం పదవీవిరమణ పొందాడు. భార్య రాజేశ్వరి సహజ కవయిత్రి. వీళ్లకు ముగ్గురు కొడుకులు రమేశ్, కిరణ్, సతీశ్ సంతానం. రెండేళ్ల క్రితం కరోనాతో సతీశ్ మరణించాడు. రమేశ్ హైదరాబాద్‌లో, కిరణ్ చెన్నైలో ఏడేళ్లుగా ఉద్యోగం చేస్తున్నారు. రమేశ్, సునీతలకు ముగ్గురు, కిరణ్, భానుప్రియలకు ఇద్దరు, సతీశ్, శ్రుతిలకు ఇద్దరు సంతానం. పండుగకు అంతా ఒకేచోట చేరి సంతోషంగా గడిపారు.

కళలకు ప్రాణం.. యువతరానికి ఆదర్శం



ఈ చిత్రంలో కనిపిస్తున్న సుకృతీ మేఘమాల స్వాతంత్ర్య సమరయోధుడు గట్టెపల్లి మురళీధర్ రావు మనవరాలు, కరాటే, యోగా మాస్టర్ ఎస్.సంపత్‌కుమార్ కుమార్తె. చిన్నప్పటి నుంచి సంగీతంపై అభిమానం పెంచుకుని డిప్లొమా సాధించారు. ఇప్పటికే 40కి పైగా ప్రదర్శనలు పూర్తి చేశారు. ఎస్వీబీసీ చానల్, శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు, యువజనోత్సవాల్లో తన గానం వినిపించింది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువతి కరీంనగర్‌కు చెందిన బ్రహ్మాండం శ్రీకుమారి. తల్లిదండ్రులు శివప్రసాద్–శేషదుర్గ ప్రోత్సాహంతో డిగ్రీ పూర్తి చేసుకున్న శ్రీకుమారి సంగీతంలో డిప్లొమా సాధించింది. జయంతి సావిత్రి వద్ద శిష్యరికం చేస్తూ హరికథాగానం చేస్తుంది. దూరదర్శన్‌లో హరికథను వినిపించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి, విజయవాడ, శ్రీశైలం, హైదరాబాద్, యాదగిరిగుట్ట, భద్రకాళి, కొండగట్టు, ధర్మపురి, యజ్ఞవరాహస్వామి ఆలయాల్లోనూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు.


త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో వేదికపై సుకృతీ మేఘమాల, బ్రహ్మాండం శ్రీకుమారి

- త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ
- హరికథాగానం, త్యాగరాజ కృతులు
- జేజేలు అందుకుంటున్న ఇద్దరు అమ్మాయిలు

వేములవాడ: పాశ్చాత్య సంగీతంలో ఓలలాడుతున్న యువతరంలో నుంచి వచ్చిన వారే. కానీ తమ దారి వేరంటూ నిరూపించుకుంటున్నారు. ప్రాచీన కళలను ప్రదర్శిస్తూ అదే యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. హరికథాగానం.. సంగీత కచేరి అంటేనే తెలియని నేటి తరానికి ప్రతినిధులు వారు. కానీ తమ తరానికి ఆ రెండు కళలను పరిచయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన యువతులు సుకృతీ మేఘమాల, బ్రాహ్మాండం శ్రీకుమారీ. అంతరించిపోతున్న ప్రాచీన కళలను ప్రాణం పోస్తున్నారు. వేములవాడ రాజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో త్యాగరాజ కృతులు, హరికథాగానం వినిపిస్తూ కళాభిమానులతో శభాష్ అనిపించుకుంటున్నారు. నాలుగో రోజు శనివారం సుకృతీ మేఘమాల త్యాగరాజ కృతులు, బ్రహ్మాండం శ్రీకుమారి శివలీలలను హరికథాగానం చేశారు.

నేటి యువతకు ఆదర్శం



సుకృతీ మేఘమాల, బ్రహ్మాండం శ్రీకుమారి నేటి యువతకు ఆదర్శం. ప్రాశ్చాత్య సంస్కృతి మోజులో వెళ్తున్న యువతరానికి ఇద్దరు అమ్మాయిలు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రాచీన కళలను ఇంత చిన్న వయస్సులో ప్రదర్శించడం ఆనందంగా ఉంది. చదువులో రాణిస్తూనే వారికి ఇష్టమైన కళలను ప్రదర్శించడం బాగుంది.

– కే.ఎస్.అనంతాచార్య, వ్యాఖ్యాత

క్లుప్తంగా

సొసైటీకి చేరిన యూరియా



సొసైటీ నుంచి యూరియా తీసుకెళ్తున్న రైతులు

రుద్రంగి(వేములవాడ): యూరియా కోసం రుద్రంగి రైతులు పడుతున్న కష్టాలు తీరాయి. 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన 'యూరియా కొరత..రైతన్న వెత' కథనానికి సొసైటీ సిబ్బంది స్పందించారు. శుక్రవారం రాత్రి ఒక లారీ లోడ్ యూరియా, శనివారం ఉదయం మరో లారీ లోడ్ యూరియాను తీసుకొచ్చి రైతులకు అందజేశారు. మరో రెండు రోజుల్లో ఇంకా రెండు లోడ్ల యూరియా వస్తుందని, సకాలంలో యూరియా తెప్పించి, యూరియా కొరత లేకుండా చూసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వెంకటరావమ్మ, సొసైటీ సీఈవో శ్రీవర్ధన్ తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

వీఆర్‌ఏల వేతనాలు మంజూరు

వేములవాడరూరల్: రెవెన్యూ కార్యాలయంలో పనిచేసిన వీఆర్‌ఏల వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్న వైనంపై 'పండుగ పూట పస్తులేనా'..? శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వేతనాలు మంజూరైనట్లు వీఆర్‌ఏల జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి మల్లారం అర్జున్ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. చాలా ఏళ్లుగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించగా అధికారులు స్పందించినప్పటికీ పరిష్కార మార్గం చూపకపోవడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సాక్షి ఎఫెక్ట్

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం



అడవిపందుల దాడిలో ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లిలోని పర్మాల పర్వ రాములు అనే కౌలు రైతు పంట పొలంలోకి అడవిపందులు ప్రవేశించి పంటను నాశనం చేశాయి. ఇటీవల ఎకరం వరి సాగుచేయగా శుక్రవారం రాత్రి చేనులోకి అడవి పందులు చొరబడి 20 గుంటల్లో పంటను ధ్వంసం చేశాయి. అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతు కోరాడు.

కల్యాణం.. కమనీయం



సిరిసిల్లలో తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు



వేములవాడలో గోదారంగనాయకుల కల్యాణానికి హాజరైన భక్తులు



సిరిసిల్లలో కల్యాణ వేడుకలు



సిరిసిల్లటౌన్/వేములవాడ: సిరిసిల్లలోని శ్రీవేంకటేశ్వరస్వామి, వేములవాడ రాజన్న అనుబంధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలలో శనివారం గోదారంగనాయకుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు రామాచారి, కృష్ణమాచారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయ ఈవో మారుతీరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల విఠల్‌రెడ్డి పాల్గొన్నారు. వేములవాడలో కన్యాదాతలుగా రాచకొండ క్రాంతి, భాను వ్యవహరించారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఘనాపాటీలు సురేశ్, గణేశ్, కార్తీక్, రవీందర్‌రెడ్డి, గౌతమ్ పాల్గొన్నారు.

సామాన్యులకు సంక్షేమ ఫలాలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- 126 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ



క్యాంపు ఆఫీస్‌లో కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల: సామాన్యులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలోని మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో శనివారం 126 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందుతున్నాయన్నారు. ఆడపిల్లల పెళ్లికి కానుకగా కల్యాణలక్ష్మీ ద్వారా ఆర్థిక సాయం గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులతోపాటు చీరను కానుకగా అందించారు. తెలంగాణ పవర్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, 'సెస్' డైరెక్టర్ దిడ్డి రమాదేవి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ఆభరణాల సేవ



ఆభరణాలతో వస్తున్న మాలధారులు

సిరిసిల్లకల్చరల్: అలంకార ప్రియుడు అయ్యప్పస్వామిని శనివారం ఆభరణాలతో సేవించారు. శబరిమలలో మకరజ్యోతి దర్శనం సందర్భంగా సిరిసిల్లలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చిన మాలధారులు పెద్ద బజార్‌లోని పుల్లూరి కుటుంబానికి చేరుకుని.. ఆభరణాలు సేకరించుకుని పాతబజార్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాచర్ల విద్యాసాగర్ గురుస్వామి చేతులమీదుగా అయ్యప్పస్వామికి మహా పడిపూజ నిర్వహించారు. దాదాపు 500 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో 'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం కోరారు. జిల్లాలో కంటిపరీక్షల నిర్వహణకు 26 బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే 26 మంది ఆప్తాల్మిక్ టెక్నీషియన్లను, 26 మంది డేటాఎంట్రీ ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు. 26 ఆటో రిఫ్రాక్టివ్ మిషన్లు, 24,034 రీడింగ్ అద్దాలు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. ఇందుకోసం 17న మాక్‌డ్రిల్ నిర్వహిస్తామని వివరించారు. ఏ రోజు ఎక్కడ శిబిరం నిర్వహించే సమాచారాన్ని ముందుగానే తెలియజేస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కంటి వెలుగును ఎంపీవోలు, తహసీల్దార్లు పర్యవేక్షించాలని కోరారు.

ఆటాడుకుంటాం

- నిత్యం వాకింగ్.. క్రికెట్
- ఉత్సాహంగా పాల్గొంటున్న వాకర్స్
- పదిహేను రోజులకోసారి ఇంటర్నల్ టోర్నీ
- ఆదర్శంగా మార్నింగ్ క్రికెట్ క్లబ్



ఇంటర్నల్ టోర్నమెంట్స్‌లో కప్ అందజేసుకుంటున్న మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులు



క్రికెట్ ఆడుతున్న మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులు

వేములవాడ: ఆరోగ్య పరిరక్షణ.. బాడి ఫిట్‌నెస్ కోసం వాకింగ్ చేయడం చూస్తుంటాం. ఇంకాస్త శ్రద్ధ ఎక్కువ పెట్టే వారు జిమ్‌లకు పోయి కసరత్తులు చేయడం చూశాం. కానీ వేములవాడలో మాత్రం ఉదయం వాకింగ్ చేసే వారు కాస్త డిఫరెంట్‌గా ఆలోచించారు. వాకింగ్‌తోపాటు క్రికెట్ ఆడాలని ఆలోచించారు. మొదట వాకింగ్ చేసి, తర్వాత క్రికెట్ ఆడుతుంటారు. బాల్, బ్యాట్ పట్టి గ్రౌండ్‌లోకి దిగారంటే వయస్సును మరిచిపోయి ఉత్సాహంగా పాల్గొంటుంటారు. నిత్యం ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు వీరి నడక, ఆట కొనసాగుతుంటోంది. వేములవాడ బైపాస్‌రోడ్డును ఆనుకుని ఉన్న మైదానంలో ప్రతీ రోజు వీరి కేరింతలు వినిపిస్తూనే ఉంటాయి.

12 మందితో మొదలై..

నాలుగేళ్ల క్రితం సంక్రాంతి పండుగ సందర్భంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఆ ఆటనే మార్నింగ్ క్రికెట్ క్లబ్ ఏర్పాటుకు బీజం వేసింది. 12 మంది సభ్యులతో ప్రారంభమైన.. నేడు 52 మందికి చేరింది. ఈ క్రికెట్ క్లబ్‌లో కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, మారం కుమార్, యువ ఫౌండేషన్ చైర్మన్ గొడిశెల రాజశేఖర్, డాక్టర్ రమణ, స్పోర్ట్స్ సెంటర్ నిర్వాహకులు మోటూరి ప్రవీణ్, ముదిరాజ్ సంఘం నాయకులు బైరి సతీశ్, ఆలయ పర్యవేక్షకులు నాగుల మహేశ్, బ్యాంక్ అధికారులు శ్రీనివాస్, మహేశ్, వేణు, అంజనీ యూత్ క్లబ్ అధ్యక్షుడు మ్యాన సంతోష్ తదితరులు ఉన్నారు.

ఇంటర్నల్ టోర్నమెంట్స్

52 మంది సభ్యులతో నిత్యం కొనసాగుతున్న మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులు నిత్యం ఒక మ్యాచ్ ఆడుతుంటారు. అంతేకాకుండా ప్రతీ పదిహేను రోజులకోసారి ఇంటర్నల్ టోర్నమెంట్ నిర్వహించుకుంటారు. విజేతలకు కప్‌లు, షీల్డ్‌లు అందజేస్తుంటారు.

ఆనందంగా ఉంది



ప్రతి రోజు వేములవాడలో అన్ని వయస్సుల వారితో క్రికెట్ ఆడుకోవడం ఆనందంగా ఉంది. నిత్యం వైద్యవృత్తిలో బిజీగా ఉన్నప్పటికీ మార్నింగ్ క్రికెట్ ఆడుకుని వెళ్లడంతో రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతున్నాను. యువకులు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉదయం వేళ గ్రౌండ్‌కు చేరుకోవాలి.

– రమణ, వైద్యుడు

ప్రజాసేవలో ఉన్నా.. ఆటలంటే ఇష్టం



నిత్యం ప్రజాసేవలో బిజీ ఉన్నప్పటికీ మార్నింగ్ క్రికెట్ ఆడడం ఎంతో సంతోషంగా ఉంటుంది. రాత్రి షటిల్ ఆడతాను. యువకులంతా ఆటలపై మక్కువ పెంచుకోవాలి. వాకింగ్, గేమ్స్‌తోనే ఆరోగ్యంగా ఉంటాం.

– నరాల శేఖర్, కౌన్సిలర్, యూనిటీ షటిల్ క్లబ్ కన్వీనర్

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులను ప్రోత్సహించాలని మేమంతా వయస్సుతో సంబంధం లేకుండా మార్నింగ్ క్రికెట్ క్లబ్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం. గ్రూప్ సభ్యులు నిత్యం ప్రాక్టీస్‌కు వస్తుంటారు. ఈసారి సంక్రాంతికి ఐదో వార్షికోత్సవం సందర్భంగా టోర్నమెంట్ నిర్వహిస్తాం.

– మోటూరి ప్రవీణ్, స్పోర్ట్స్ సెంటర్

స్పోర్టివ్‌గా ఉంటారు



మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులంతా స్పోర్టివ్‌గా ఉంటారు. నేను వయస్సులో అందరికంటే చిన్నవాడిని. అయినప్పటికీ అందరూ సరదాగా ఉంటారు. క్లబ్ సభ్యులు అందరూ పోటీపడి ఆడుతుంటారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి.

– నవీన్, క్లబ్ సభ్యుడు





రాజన్న సన్నిధి.. భక్తజన పెన్నిధి



వేములవాడ: రాజన్నను శనివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వరుస సెలవులు రావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నలభై ఏళ్లుగా తెలంగాణలోనే..



వేములవాడ: ఆంధ్రా ప్రాంతం నుంచి ఉపాధి కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, వేములవాడ ప్రాంతాలకు వలస వచ్చిన కొందరు ఏటా సంక్రాంతి పండుగను ఇక్కడే జరుపుకుంటున్నారు. చిట్టి రామారావు–శ్రీకుమారి దంపతులతోపాటు చాలా మంది ఇక్కడే ఉపాధి పొందుతున్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారంతా ఇక్కడే తమ బంధువుల మధ్య పండుగ చేసుకుంటున్నారు. శనివారం భోగిని పురస్కరించుకుని వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో ఇలా ఒకే చోట చేరారు. తీరొక్క పిండి వంటకాలతో పండుగ చేసుకున్నారు.

రోడ్డుపై తల్వార్‌తో కేక్ కటింగ్

- ఐదుగురి అరెస్టు

వేములవాడ: వేములవాడలోని అమరవీరుల స్థూపం వద్ద నడిరోడ్డుపై శుక్రవారం అర్ధరాత్రి వస్తాద్ అఖిల్ పుట్టిన రోజును పురస్కరించుకుని మారణాయుధంతో కేక్ కట్ చేసి గంజాయి తాగుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసిన ఐదుగురిని శనివారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. వస్తాద్ అఖిల్‌తోపాటు మైలారం రామకృష్ణ, చింతలకోటి అనిల్, ఆకుల గణేశ్, రేపాక శివను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కొండగట్టులో గోదాదేవి కల్యాణం



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గోదాదేవి–రంగనాథస్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వివాహ తంతు వీక్షించారు. మరోవైపు.. గోదాదేవి కల్యాణం సందర్భంగా ఆలయ అధికారులు శాలువాలు, కండువాలను విచ్చలవిడిగా వృథా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై ఆలయ కమిటీ డైరెక్టర్ పోచమల్ల ప్రవీణ్‌కుమార్ నేరుగా ఆలయ సూపరింటెండెంట్ సునీల్ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు అధికారులు నిబంధనలు అతిక్రమిస్తూ ఎవరికి పడితే వారికి శాలువాలు, కండువాలు కప్పుతూ ఆలయ సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ఆలయ చైర్మన్ మారుతీస్వామి, ఈవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో తెప్పల పోటీలు



వేములవాడఅర్బన్: రుద్రవరం పాత గ్రామంలోని మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లో గ్రామ ముదిరాజ్ మత్స్యకార్మికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం తెప్పల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది పాల్గొన్నారు. సీనియర్స్‌లో 20, జూనియర్స్‌లో 20 మంది పాల్గొన్నారు. మానేరు నీటిలో ఒక కిలోమీటర్ దూరంలో ఏర్పాటుచేసిన జెండాలను తీసుకొచ్చిన వారికి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా బొమ్మ మహేశ్ రూ.2,016, ద్వితీయ తునికి స్వామి రూ.1,516, తృతీయ తునికి బాలరాజు రూ.1,016, జూనియర్స్‌లో ప్రథమ బహుమతిగా తునికి రఘు రూ.2,016, ద్వితీయ తునికి రాము రూ.1,516, తృతీయ వంశీ రూ.1,016 అందజేశారు. నిర్వాహకులు తునికి నరేశ్, సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణదేవరావు, ఊరడి ప్రవీణ్, పిల్లి కనకయ్య, వంకాయల భూమయ్య పాల్గొన్నారు.

అమృతలాల్ శుక్లా విగ్రహం ఏర్పాటు చేయాలి



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ అమృతలాల్ శుక్లా విగ్రహాన్ని సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. శనివారం అమృతలాల్ శుక్లా 32వ వర్ధంతి సందర్భంగా తంగళ్లపల్లి మానేరువాగులోని శుక్లా స్థూపం వద్ద నివాళి అర్పించారు. శాంతి ప్రకాష్ శుక్లా, కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, ముక్తికాంత అశోక్, శ్రీరామ్ సదానందం, సూరం పద్మ, శ్రీనివాస్, ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, గోవింద లక్ష్మణ్, సిరిమల్ల సత్యం, రమేశ్‌చంద్ర, వీరేశం, సురేశ్, శేఖర్, సంపత్, గోవర్ధన్ పాల్గొన్నారు.